సాక్షి
నల్లగొండ
సోమవారం । 30 । అక్టోబర్ । 2023



త'స్మార్ట్' జాగ్రత్త
ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియాలో శృతిమించిన, అసత్య ప్రచారం చేసినా పోలీసు కేసులు తప్పవు.
- 10లో



బుద్ధ ధాతువుల ప్రతిష్ఠాపన
సాగర్‌లోని బుద్ధవనంలో ఆదివారం చేపట్టిన బుద్ధ ధాతువుల ప్రతిష్ఠాపన ఉత్సవం వైభవంగా కొనసాగింది.
- 12లో



ప్రజా ప్రభుత్వం రావాలే..
తెలంగాణ రాష్ట్రంలో నిరంకుశ పాలన పోయి ప్రజా ప్రభుత్వం రావాలని ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.
- 12లో

న్యూస్‌రీల్

రేపు మరో మూడు చోట్ల ముఖ్యమంత్రి సభలు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం కె.చంద్రశేఖర్ రావు ఈ నెల 31వ తేదీన ఉమ్మడి జిల్లాలోని మరో మూడు నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. హుజూర్‌నగర్, మిర్యాలగూడ, దేవరకొండ నియోజకవర్గాల్లో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొని ప్రసంగించనున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 2 గంటల వరకు హుజూర్‌నగర్ సభలో, 2 గంటల నుంచి 3 గంటల వరకు మిర్యాలగూడ సభలో, 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు దేవరకొండ సభలో సీఎం కేసీఆర్ పాల్గొననున్నారు. ఈ మేరకు ఆయా నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల నేతృత్వంలో సభలు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి


రికార్డులు పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ కాళిందిని

కట్టంగూర్: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని డీఆర్‌డీఓ కాళిందిని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం మండలంలోని అయిటిపాములలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, రికార్డులను ఆమె పరిశీలించి మాట్లాడారు. రైతులు తేమశాతం 17 లోపు ఉండేలా ధాన్యాన్ని ఆరబెట్టి కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే ట్రాన్స్‌పోర్ట్ అయ్యేలా చూడడంతో పాటు ఆ వివరాలను ట్యాబ్‌లో నమోదు చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట ఏపీఎం వినోద, వీఓఏ, సంఘం బంధం సభ్యులు ఉన్నారు.

కాంగ్రెస్ బస్సు యాత్ర వాయిదా

సాక్షి,యాదాద్రి : భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో సోమవారం జరగాల్సిన కాంగ్రెస్ విజయభేరి బస్సు యాత్ర వాయిదా పడినట్లు టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జనగామ, ఆలేరు, భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరప తలపెట్టిన బస్సు యాత్రకు రూట్ మ్యాప్ కూడా సిద్ధం చేశామని, పాదయాత్రలు, కార్నర్ మీటింగ్‌లకు ఏర్పాట్లు చేశామన్నారు. అయితే అనివార్యకారణాల వల్ల బస్సు యాత్రను టీపీసీసీ అధిష్టానం వాయిదా వేసిందన్నారు. తదుపరి తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు.

యాదాద్రిలో యథావిధిగా దర్శనాలు

యాదగిరిగుట్ట: చంద్రగ్రహణం సందర్భంగా శనివారం సాయంత్రం 4 గంటకు యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని మూసివేసిన ఆచార్యులు.. ఆదివారం వేకువజామున 4:30 గంటలకు తిరిగి తెరిచారు. తొలుత ఆలయాన్ని శుద్ధిచేసి, గర్భాలయం, ముఖ మండలం, తిరు వీధులు, రామానుజకూటం, ప్రసాద విక్రయశాల, క్యూలైన్లు, విష్ణు పుష్కరిణి, లక్ష్మీ పుష్కరిణి, కల్యాణకట్ట, శ్రీసత్యనారాణస్వామి వ్రత మండపం, అన్న ప్రసాద భవనంలో సంప్రోక్షణ, గర్భాలయం ఎదుట నవకలశ స్నపనం, గ్రహదోష పరిహార్ధ హోమం చేపట్టారు. అనంతరం సుప్రభాతం, అభిషేకం, అర్చనతో పాటు సంప్రదాయ పూజలు చేపట్టారు. శ్రీసుదర్శన హోమం, నిత్యకల్యాణం ఒక గంట 15 నిమిషాలు ఆలస్యంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవోత్సవం కనుల పండువగా నిర్వహించారు.


కోదాడలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, పక్కన అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్, వేదికపై మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే సైదిరెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు


తిరులగిరిలో జరిగిన తుంగతుర్తి నియోజకవర్గ సమరశంఖారావ సభలో పిడికిలి బిగించి నినదిస్తున్న సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ అభ్యర్థి గాదరి కిశోర్



ఆలేరు సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగిస్తుండగా ఆయనకు పాదాభివందనం చేస్తున్న ప్రభుత్వ విప్, అభ్యర్థి గొంగిడి సునీత

కోదాడ, తిరుమలగిరి, ఆలేరులో గులాబీ దళపతి

- మధ్యాహ్నం 2.37 గంటల నుంచి సాయంత్రం 5.42 వరకు సుడిగాలి పర్యటన
- స్థానికంగా జరిగిన అభివృద్ధిని వివరిస్తూనే ప్రతిపక్షాలపై విమర్శలు
- మూడు చోట్ల సాగునీరు, ప్రభుత్వ పథకాల గురించి ప్రస్తావన
- ప్రజల్లో, పార్టీ శ్రేణుల్లో ఉత్తేజం నింపిన కేసీఆర్ ప్రసంగం

మూడు గంటలు.. మూడు సభలు

ఉమ్మడి జిల్లాలో ప్రచారాన్ని హోరెత్తించిన బీఆర్ఎస్ అధినేత


తిరుమలగిరి సభా వేదికపై చెరుకు సుధాకర్‌తో మాట్లాడుతున్న సీఎం


కోదాడ సభలో యువకుడి కేరింత

బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆదివారం సుడిగాలి పర్యటన చేశారు. కోదాడ, ఆలేరులో నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలతో పాటు తుంగతుర్తిలో సమర శంఖారావం సభలో ఆయన పాల్గొన్నారు. మధ్యాహ్నం 2.37గంటలకు మొదట కోదాడకు వచ్చిన కేసీఆర్ సాయంత్రం 5.42 గంటలకు ఆలేరు నుంచి తిరుగుపయనమయ్యారు. సుమారు మూడు గంటల పాటు జిల్లాలో గడిపారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు స్థానికంగా జరిగిన అభివృద్ధిని ఆయా సభల్లో వివరించారు. పథకాలన్నీ ఉండాలంటే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఆయకట్టుకు రెండు పంటలకు నీళ్లు

కోదాడ: ముందుగా సీఎం కేసీఆర్ కోదాడకు చేరుకున్నారు. ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడుతూ.. కాళేశ్వరం జలాలను మూసీ దాటించి ఉదయసముద్రం, అడవిదేవులపల్లి రిజర్వాయర్లకు తరలించి నాగార్జునసాగర్ ఆయకట్టుకు రెండు పంటలకు నీళ్లు అందిస్తామని, ఇది బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమని చెప్పారు. ఇటీవల కాంగ్రెస్ నాయకుడు భట్టి విక్రమార్క కోదాడ నియోజకవర్గంలో పాదయాత్ర చేసి ఇక్కడికి చుక్క కూడా కాళేశ్వరం నీరు రావడం లేదని పచ్చి అబద్ధాలు చెప్పాడని అన్నారు. మూడున్నరేళ్లుగా కోదాడ నియోజకవర్గంలోని మునగాల, నడిగూడెం, మోతె మండలాలకు కాళేశ్వరం జలాలను అందిస్తున్నది నిజం కాదా అని ఆయన ప్రశ్నించారు. సాగర్ ఆయకట్టులో ఉన్న కోదాడ ప్రాంతానికి నీరు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతుంటే తానే 2001లో కోదాడ నుంచి హాలియా వరకు పాదయాత్ర చేసి నీటిని ఇప్పించానని చెప్పారు. ఎంత మంది వ్యతిరేకించినా బీసీ బిడ్డ మల్లయ్యకు టికెట్ ఇచ్చానని, బీసీలంతా ఏకమై మల్లయ్యయాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. జనాభాలో తాము 50 శాతానికి పైగా ఉన్నామని మాటలు చెప్పడం కాదని, బీసీల్లో చైతన్యం రావాలని, నవంబర్ 30న ఓట్ల రూపంలో చూపి మల్లయ్యను గెలిపించాలన్నారు. కోదాడలో బీసీ బిడ్డ మల్లయ్యను గెలిపిసేరూ.10కోట్లతో ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లోనే బీసీ భవన్ నిర్మాణం చేయించి ఇస్తానని హామీ ఇచ్చారు.


తిరుమలగిరి సభలో సమస్కరిస్తున్న కేసీఆర్

ఆలేరు రైతుల గోస తీరింది

సాక్షి,యాదాద్రి : తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు అలేరులో కరువు తాండవం చేసిందని, బోర్లు వేస్తే నీళ్లు పడక, నీళ్లు పడినా కరెంటు లేక రైతులు ఎన్నో గోసలు పడ్డరని ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు గుర్తుచేశారు. తిరుమలగిరి సభ ముగించుకుని కేసీఆర్ ఆలేరుకు సాయంత్రం 5.05 గంటలకు వచ్చారు. అనంతరం ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతూ.. తాను పలుమార్లు తిరిగి యాదగిరిగుట్ట ఆలయ నిర్మాణం చేసుకున్నామన్నారు. యాదగిరిగుట్ట గోపురం ఎత్తంత ఓట్లు సునీతకు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. మల్లన్న సాగర్ నెత్తిమీద కుండలా ఉంటుందని, దాంతో గందమల్ల చెరువు, బస్వాపూర్ రిజర్వాయర్ ఎప్పుడూ నిండి ఉంటాయయన్నారు. యాదగిరిగుట్ట గండి చెరువును కూడా మల్లన్నసాగర్ నీటితో నింపుకున్నామన్నారు. ఐదు నెలల తర్వాత బస్వాపూర్ నింపుకుంటామని, దాంతో గంధమల్ల చెరువు ఎండకాలంలో మత్తడి దుంకుతుందన్నారు. అశ్వారావుపల్లి కాలువలు పూర్తి చేసుకోనున్నామని, ప్రతి వాగుపై చెక్ డ్యాంలు నిర్మించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆలేరు నియోజకవర్గంలో గతంలో యాసంగిలో 25 వేల ఎకరాలు మాత్రమే సాగయ్యేదని, ఇప్పుడు రెండు లక్షల 16 వేల ఎకరాలు సాగవుతోందన్నారు.

సునీత నా బిడ్డ..
ఎమ్మెల్యే గొంగిడి సునీత తన బిడ్డ అని, నియోజకవర్గ అభివృద్ధి కోసం ఆమె తన ముందు పెట్టిన డిమాండ్లు అన్నింటినీ తప్పకుండా నెరవేరుస్తానని నియోజకవర్గ ప్రజలకు కేసీఆర్ హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో కూడా గొంగిడి సునీతకు అండగా నిలిచి ఘనవిజయం కట్టబెట్టాలని ఓటర్లను కోరారు. సునీత మళ్లీ గెలిస్తే ఆలేరు నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.

భిక్షమయ్యగౌడ్ బాధ్యత నాది
భిక్షమయ్యగౌడ్‌కు బ్రహ్మాండమైన రాజకీయ భవిష్యత్తు ఉంటుందని సీఎం కేసీఆర్ ప్రకటించారు. వేదికపైన ఉన్న భిక్షమయ్యగౌడ్‌ను చూపిస్తూ ఆయన బాధ్యతను తాను తీసుకుంటున్నానని అన్నారు. ఎమ్మెల్యే సునీత, భిక్షమయ్యగౌడ్‌ల నాయకత్వంలో ఆలేరును బ్రహ్మాండంగా అభివృద్ధి చేసుకోవాలన్నారు.

కిషోర్‌ను గెలిపిస్తే నియోజకవర్గమంతా దళితబంధు

తిరుమలగిరి/అర్వపల్లి/నాగారం: కోదాడ సభ అనంతరం కేసీఆర్ తిరుమలగిరికి చేరుకున్నారు. అక్కడ నిర్వహించిన తుంగతుర్తి నియోజకవర్గ సమర శంఖారావం సభలో మాట్లాడారు. ఉస్మానియా యూనివర్సిటీ తెలంగాణ ఉద్యమత నేత గాదరి కిషోర్‌ను తుంగతుర్తి అసెంబ్లీ నుంచి మూడో సారి లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. కిషోర్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తే తుంగతుర్తి నియోజకవర్గమంతా దళితబంధు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. దళితబంధు పథకం కోసం ఎమ్మెల్యే కిషోర్ తనతో కొట్లాడి తిరుమలగిరి మండలాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా తీసుకొచ్చాడని అన్నారు. తెలంగాణ రాక ముందు తుంగతుర్తి నియోజకవర్గం హత్యలు, అరాచకాలు, కక్షలు, కార్పణ్యాలతో అట్టుడుకిందన్నారు. మంచినీళ్లు లేక కరువు తాండవించడంతో ప్రతి గ్రామం నుంచి వలసలు వెళ్లేవారని గుర్తుచేశారు. విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి హెలికాప్టర్‌లో తనతో వచ్చేటప్పుడు ఒక్కొక్క గ్రామం చూపిస్తూ.. చెరువులు కాళేశ్వరం జలాలతో నిండి సస్యశ్యామలంగా మారిన పరిస్థితిని కళ్లకు కట్టినట్లు చూపించారని చెప్పారు.

గోదావరి జలాలతో సస్యశ్యామలం
తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తరువాత కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు వస్తుండటంతో 1.50లక్షల ఎకరాలకు సాగునీరందుతోందన్నారు. ఇప్పుడిప్పుడే తుంగతుర్తి ప్రజలు తెల్లబడుతున్నారని, వారు మరింత గొప్పగా ఉండాలంటే బీఆర్ఎస్ గెలవాలన్నారు. బునాదిగాని కాలువను త్వరలోనే వెడల్పు చేయడమేకాకుండా దీనిని బస్వాపూర్ ప్రాజెక్టుతో అనుసంధానం చేస్తామన్నారు. తద్వారా మోత్కూర్, అడ్డగూడూరు మండలాలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. దేవాదుల ద్వారా తిరుమలగిరి మండలంలోని ఏడెనిమిది ఊర్లకు నీళ్లు అందితే తుంగతుర్తి నియోజకవర్గం మొత్తం 2లక్షల ఎకరాలకు నీళ్లు పారుతాయన్నారు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలో రూ.30వేల కోట్లతో అల్ట్రా మెగా పవర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నామని, నాలుగైదు నెలల్లో 4వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు. గతంలో కాంగ్రెస్ పాలనలో తుంగతుర్తి నియోజకవర్గంలో రోడ్లు అధ్వానంగా ఉండేవని, దంతాలపల్లి రోడ్డుపై వెళితే దంతాలు విరిగిపోయేవన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో 27తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశామని తెలిపారు. తుంగతుర్తి నియోజకవర్గంలో రెండు 220కేవీ సబ్‌స్టేషన్లు, 15 సబ్‌స్టేషన్లు, మూడు జాతీయ రహదారులు, తుంగతుర్తిలో 100 పడకల ఆస్పత్రి తీసుకొచ్చిన ఘనత కిషోర్‌ది అని అన్నారు.


తిరుమలగిరిలో నిర్వహించిన తుంగతుర్తి నియోజకవర్గ సమరశంఖారావ సభకు హాజరైన పార్టీ శ్రేణులు, ప్రజలు


సభలో గిరిజన యువతి ఉత్సాహం

అలరించిన ఆటాపాట

కోదాడ, తిరుమలగిరి, ఆలేరులో జరిగిన సీఎం కేసీఆర్ ఎన్నికల సభల్లో కళాకారులు తమ ఆటాపాటలతో అలరించారు. కోదాడలో మధుప్రియ, తిరుమలగిరిలో మిట్టపల్లి సురేందర్, ఆలేరులో ఏపూరి సోమన్న కళాబృందాలు పాడిన పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. కళాకారులు ఆడిపాడుతున్న సమయంలో యువతీయువకులు కేరింతలు కొడుతూ చిందులు వేశారు. జనం రెట్టింపు ఉత్సాహంతో చప్పట్లు కొడుతూ గొంతు కలిపి ఆడిపాడారు. కోదాడలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, ఆలేరులో డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి నృత్యం చేసి ఉత్సాహపరిచారు.

కాంగ్రెసోళ్ల మాయమాటలు నమ్మొద్దు

- హాలియా గిరిజన ఆత్మగౌరవ సభలో మంత్రి సత్యవతి రాథోడ్


సభలో మాట్లాడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్, చిత్రంలో ఎమ్మెల్యే భగత్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి తదితరులు

హాలియా: కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పే మాయమాటలు నమ్మి మోసపోయి వారికి ఓట్లు వేయొద్దని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ప్రజలకు సూచించారు. ఆదివారం హాలియా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ గిరిజన ఆత్మగౌరవ సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో కాంగ్రెస్ పార్టీకి అతీగతి లేదని, వందేళ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీకి రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడు కావడం ఆ పార్టీ దౌర్భాగ్యమన్నారు. ఆరేళ్ళలో ఆరుగురు కలిసి ఉంటారనే గ్యారంటీ లేదు, ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరో ప్రజలకు చెప్పలేని వాళ్లు ఆరు గ్యారంటీ స్కీంలు అమలు చేస్తారట అని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో ఈ ప్రాంత గిరిజనులు కారు గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే నోముల భగత్ మాట్లాడుతూ జానారెడ్డిని ఈ ప్రాంత ప్రజలు ఏడుసార్లు గెలిపిస్తే ఆయన చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. మరోసారి తనను ఆశీర్వదించి గెలిపిస్తే మిగిలిపోయిన పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. అంతకు ముందు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ట్రికార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్, రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ కోఆపరేటివ్ చైర్మన్ వాల్యా నాయక్, జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, జెడ్పీటీసీ కృష్ణారెడ్డి, నాయకుడు కడారి అంజయ్య యాదవ్, ఎస్టీ కమిషన్ సభ్యుడు రాంబాబునాయక్, బాబురావు నాయక్, వివేకరావ్, సాదం సంపత్‌కుమార్, కేతావత్ బిక్షానాయక్, రవినాయక్, పీఏసీఎస్ చైర్మన్ గుంటక వెంకట్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు, కర్ణ బ్రహ్మారెడ్డి, కూరాకుల అంతయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, యడవెల్లి మహేందర్‌రెడ్డి, అల్లి పెద్దిరాజు పాల్గొన్నారు.

ఎరుకల కులస్తులకు సముచిత స్థానం కల్పించాలి

నల్లగొండ టూటౌన్: ఎరుకల కులస్తులు రాజకీయంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారని, అన్ని రాజకీయ పార్టీలు ఎరుకల కులస్తులకు సముచిత స్థానం కల్పించాలని తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు మానుపాటి భిక్షమయ్య డిమాండ్ చేశారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన సంఘం జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానికంగా రాజకీయ అవకాశాలు కల్పించే పార్టీలకే ఎరుకల కులస్తుల మద్దతు ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కందుల అంజయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు రస్తాపురం వెంకన్న, మానుపాటి సతీష్, సోమయ్య, జంగయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థుల వ్యయ వివరాలు నమోదు చేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి కర్ణన్


మాట్లాడుతున్న కలెక్టర్ కర్ణన్

నల్లగొండ: ఈ ఎన్నికల్లో పార్టీలు, అభ్యర్థులు ఖర్చు పెట్టే వ్యయ వివరాలను సహాయ వ్యయ పరిశీలకులు, అకౌంటింగ్ టీమ్ సభ్యులు పక్కాగా నమోదు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ.కర్ణన్ సూచించారు. ఆదివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నోడల్ అధికారులు, ఎన్నికల వ్యయ పరిశీలకుల, అకౌంటింగ్ టీమ్ సభ్యులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. నవంబర్ 3న అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలై నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. అభ్యర్థులు వ్యయ నిర్వహణ రిజిస్టర్లు పక్కాగా నిర్వహించడంతోపాటు రోజువారీ నివేదికలను ఎన్నికల కమిషన్‌కు పంపించేందుకు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన స్క్వాడ్ బృందాలు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థి రూ.40లక్షలకు మించి ఖర్చు చేయరాదని ఎన్నికల సంఘం పరిమితి విధించినట్టు తెలిపారు. ఓటర్లు నిర్భయంగా, స్వేచ్ఛగా తమ ఓటుహక్కు వినియోగించుకునేలా యంత్రాంగం అవగాహనా కలిగించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంసీసీ నోడల్ అధికారి హరిసింగ్, జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలన నోడల్ అధికారి, డీసీఓ కిరణ్‌కుమార్, సహాయ వ్యయ పరిశీలకులు, అకౌంటింగ్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

పోలింగ్ సమయం ఉదయం 7నుంచి సాయంత్రం 5 గంటల వరకు
జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నవంబర్ 30న పోలింగ్ సమయం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికల కమిషన్ నిర్ణయించిందని జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ.కర్ణన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్ రోజు సాయంత్రం 5 గంటలలోపు క్యూ లైన్‌లో ఉన్నవాళ్లనే ఓటు వేయడానికి అనుమతిస్తారని పేర్కొన్నారు.



కోదాడలో ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన జనం



ఆలేరు సభలో బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలు



ఆలేరు సభలో వృద్ధురాలి ఆనందోత్సాహం

సీఎం సభల సైడ్‌లైట్స్

కోదాడ..

- కోదాడలోని ప్రజా ఆశీర్వాద సభా ప్రాంగణానికి సీఎం కేసీఆర్ మధ్యాహ్నం 2.37 గంటలకు హెలికాప్టర్ ద్వారా చేరుకున్నారు.
- సీఎం వెంట మంత్రి జగదీష్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ వచ్చారు.
- 2.46 గంటలకు కేసీఆర్ ప్రసంగాన్ని ప్రారంభించి, 3.16 వరకు కొనసాగించారు.
- మల్లయ్యను గెలిపిస్తే కోదాడలో రూ.10 కోట్లతో బీసీ భవన్ నిర్మిస్తాననడంతో సభికులు చప్పట్లు కొట్టారు.
- మంచినీటి ప్యాకెట్ల కోసం పలువురు ఎగబడి బస్తాలను ఎత్తుకెళ్లారు.

తిరుమలగిరి..

- తిరుమలగిరి సభకు సీఎం కేసీఆర్ 3:50గంటలకు చేరుకున్నారు.
- 4:00గంటలకు సీఎం ప్రసంగం ప్రారంభించి 4:29 గంటలకు ముగించారు.
- సభా వేదికపైకి కేసీఆర్ వచ్చాక ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ 5నిమిషాల పాటు మాట్లాడి సీఎం మైక్ ఇచ్చారు.
- కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ తెచ్చుడో.. అని సీఎం అనగానే సభికులు పెద్దఎత్తున నినాదాలు చేశారు.
- హెలిపాడ్ వద్ద సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్యే కిశోర్ సతీమణి గాదరి కమల బొట్టుపెట్టి స్వాగతం పలికారు.
- సీఎం కేసీఆర్ కిశోర్‌ను హుషారైనోడు అంటూ పొగడ్తలతో ముంచెత్తారు.
- సభా వేదికపై సీఎం కేసీఆర్ పిట్టకథను వినిపించి సభికులను ఉత్సాహపరిచారు.

యాదగిరిగుట్ట..

- ఆలేరులోని ప్రజా ఆశీర్వాద సభా ప్రాంగణానికి మధ్యాహ్నం 2.30గంటల నుంచే వివిధ ప్రాంతాల ప్రజలు చేరుకున్నారు.
- 3.05 గంటలకు ఏపూరి సోమన్న, ఆలేరు విజయ, యాట సంధ్య తమ కళా బృందాలతో ధూంధాం నిర్వహించారు.
- 4.58గంటలకు ప్రభుత్వ విప్, ఆలేరు అభ్యర్థి గొంగిడి సునీత ప్రసంగించారు.
- 5.05గంటలకు సీఎం కేసీఆర్ సభా వేదికపైకి చేరుకుని ప్రజలకు అభివాదం చేశారు.
- ఇదే సమయంలో ప్రసంగిస్తున్న విప్ గొంగిడి సునీత కంట తడి పెట్టుకున్నారు.
- 5.11గంటలకు సీఎం కేసీఆర్ ప్రసంగం ప్రారంభించి, 5.32గంటలకు ముగించారు. 5.42గంటలకు కేసీఆర్ హెలిక్యాప్టర్‌లో తిరిగి హైదరాబాద్‌కు వెళ్లిపోయారు.
- సునీత నా బిడ్డ అని సీఎం కేసీఆర్ రెండు సార్లు అనడంతో సభ వేదికపై ఉన్న వారు, జనాలు ఒక్క సారిగా చప్పట్లు కొడుతూ, ఆనందం వ్యక్తం చేశారు.
- చివర్లో బూడిద భిక్షమయ్యగౌడ్‌కు రాజకీయంగా భరోసా కల్పిస్తున్నట్లు ప్రకటించడంతో యువత కేరింతలు కొట్టారు.

ఆనందం.. మూడింతలు

- బీఆర్‌ఎస్ సభలు విజయవంతం

జంగ్ తెలంగాణ

కోదాడ, తిరుమలగిరి, యాదగిరిగుట్ట : ఉమ్మడి జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో సీఎం సభలు విజయవంతం కావడంతో ఆ పార్టీ క్యాడర్‌లో, నాయకుల్లో ఉత్సాహం నెలకొంది. ముందుగా.. కోదాడ బైపాస్ రోడ్డులోని కట్టకొమ్ముగూడెం చౌరస్తా వద్ద ఆదివారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాదసభ సక్సెస్ అయ్యింది. మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రారంభం కావాల్సిన సభకు ఉదయం 11 గంటల నుంచే ప్రజలను ట్రాక్టర్లు, ఆటోల్లో తరలించారు. సభకు వచ్చిన వారిలో ఎక్కువశాతం మంది మహిళలే ఉన్నారు. సీఎం రావడం ఆలస్యం కావడంతో కళాకారులు ధూం ధాం నిర్వహించారు. కళాకారులతో పాటు ఎమ్మెల్యే నృత్యం చేయడం ఆకట్టుకుంది. మధ్యాహ్నం 2.37 గంటలకు కోదాడకు వచ్చిన సీఎం 2.46కు తన ప్రసంగాన్ని ప్రారంభించారు. 30 నిమిషాలపాటు తన ప్రసంగాన్ని కొనసాగించారు. ప్రసంగం ప్రారంభంలో.. ఆరు నెలల క్రితం పలువురు తన వద్దకు వచ్చి మల్లయ్యకు టికెట్ ఇస్తే గెలవడని చెప్పారని, ఎవరు ఎన్ని చెప్పినా వినకుండా.. గెలిస్తే గెలిచిండు.. ఓడితే ఓడిండు అని చెప్పి బీసీ బిడ్డకు తాను టికెట్ ఇచ్చానని గెలిపించాల్సిన బాధ్యత బీసీలదేనని చెప్పడంతో పాటు వచ్చిన వారి ఉత్సవాన్ని చూస్తుంటే మల్లయ్యకు ఫాలోయింగ్ బాగానే ఉంది అనడంతో పలువురు యువకులు కేరింతలు కొట్టారు. సభలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ మాజీ ఇన్‌చార్జి శశిధర్‌రెడ్డిలు మాత్రమే ప్రసంగించారు. అసమ్మతి నేతలుగా ఉన్న శశిధర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వనపర్తి శిరీష, ఆమె భర్త లక్ష్మీనారాయణలను సీఎం పేర్లతో పిలవడం సభికులు ఆసక్తిగా గమనించారు. ఈ కార్యక్రమంలో మంత్రి జగదీష్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, హుజూర్‌నగర్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ఎమ్మెల్సీ మధుసూదనాచారి, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, పల్లె రవికుమార్‌గౌడ్, దూదిమెట్ల బాలరాజు, కోదాడ, నడిగూడెం ఎంపీపీలు చింతా కవితారెడ్డి, యాతాకుల జ్యోతి, మున్సిపల్ వైస్‌చైర్మన్ వెంపటి పద్మ, కల్లూరి పద్మజ, దేవమణి, బెజవాడ శిరీష, మేదర లలిత, కమదం చందర్‌రావు, ఖాజామొయినొద్దీన్, షేక్ నయీం పాల్గొన్నారు.

తిరుమలగిరిలో జోష్

తుంగతుర్తి నియోజకవర్గం పరిధిలోని తిరుమలగిరిలో ఆదివారం నిర్వహించిన బీఆర్‌ఎస్ సమర శంఖారావం సభ పార్టీ శ్రేణుల్లో ఉత్సహం నింపింది. సీఎం కేసీఆర్ హాజరైన ఈ సభకు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. మధ్యాహ్న 12గంటల నుంచే సభకు జనంరావడం కన్పించింది. గాయకులు మిట్టపల్లి సురేందర్, మద్దెల సందీప్‌లు ఆట, పాటలతో ప్రజలను అలరించారు. మధ్యాహ్నం 3:46గంటలకు సీఎం హెలికాప్టర్‌లో ఉండి సభా స్థలిని ఒక రౌండ్ వీక్షించారు. సీఎం కేసీఆర్ హెలికాప్టర్‌లో కోదాడ నుంచి మంత్రి జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదనాచారితో కలిసి వచ్చారు. సభలో జెడ్పీచైర్‌పర్సన్ గుజ్జ దీపిక యుగేందర్‌రావు, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, శాసన సభ మాజీ స్పీకర్ మధుసూదనాచారి, కార్పొరేషన్ చైర్మన్లు గ్యాదరి బాలమల్లు, రామకృష్ణారెడ్డి, రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్‌ఏ రజాక్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్, చెరుకు సుధాకర్, కాసోజు శంకరమ్మ, గాదరి కమల, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కొమ్మినేని స్రవంతిసతీష్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ పోతరాజు రజినిరాజశేఖర్, డీసీసీబీ మాజీ చైర్మన్ బీరవోలు సోమిరెడ్డి, జిల్లా శంకర్, ఎంపీపీలు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

ఆలేరులో సీఎం సభ సక్సెస్

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సీఎం కేసీఆర్ ఆలేరులో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభ సక్సెస్ అయ్యింది. ఆలేరు సభలో సుమారు 21 నిమిషాలు ప్రసంగించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి ప్రజా ఆశీర్వాద సభకు వచ్చిన జనాన్ని చూసి సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. సీఎం ప్రసంగంతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో జోష్ కనిపించింది. యువత, మహిళలు పెద్దఎత్తున తరలివచ్చారు. అయితే నియోజకవర్గంలోని దూర ప్రాంతాలనుంచి వాహనాల్లో జనం సీఎం ప్రసంగించే వరకు వస్తూనే ఉన్నారు. ఆలేరు సమీపంలో జనంతో వచ్చే వాహనాలు సభా ప్రాంగణంలోకి రావడనికి ఇబ్బందులు పడ్డారు. దూరంగానే వాహనాలు నిలిచిపోయాయి. ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అధ్యక్షత వహించిన ఈ సభలో విద్యుత్ శాఖ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూధనాచారి, మోతే సోమిరెడ్డి, ప్రొఫెసర్ దినేష్‌కుమార్, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ మోత్కుపల్లి జ్యోతి, ఆలేరు, యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్మన్లు శంకరయ్య, సుధాహేమేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రవీందర్, గ్యాదపాక నాగరాజు, పుట్ట మల్లేష్ పాల్గొన్నారు.

● ఆలేరులో..



ఆలేరులో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్, పక్కన ఎమ్మెల్యే గొంగిడి సునీత



వేదికపై లవంగం తింటున్న కేసీఆర్



వేదికపై మోతె సోమిరెడ్డిని ఆప్యాయంగా పలకరిస్తున్న సీఎం కేసీఆర్

● కోదాడలో..



బొల్లం మల్లయ్య మనువడిని పలకరిస్తున్న సీఎం కేసీఆర్



వేదికపై నాయకులను పలకరిస్తున్న కేసీఆర్



కోదాడ సభకు బతుకమ్మ తీసుకువస్తున్న మహిళలు

● తిరుమలగిరిలో..



తిరుమలగిరిలో నిర్వహించిన సమర శంఖారావం సభలో మాట్లాడుతున్న కేసీఆర్, పక్కన ఎమ్మెల్యే గాదరి కిశోర్



పాటలు పాడుతున్న గాయకుడు మిట్టపల్లి సురేందర్



నృత్యం చేస్తున్న యువతులు

సీఎం సభల్లో అభ్యర్థులు ఏం మాట్లాడారంటే..

కోదాడను సస్యశ్యామలం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే: బొల్లం మల్లయ్య

తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన మహోన్నత వ్యక్తి సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్లలో ఒక కుటుంబ సభ్యుడిలా ప్రజలకు అండగా ఉంటున్నారని తెలిపారు. కాళేశ్వరం జలాలతో కోదాడ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేశారని కొనియాడారు. తల్లిదండ్రులు తనకు జన్మనిస్తే రాజకీయంగా పునర్జన్మనిచ్చింది సీఎం కేసీఆర్ అని అన్నారు. విద్యార్థి దశ నుంచి అనేక ఉద్యమాల్లో పనిచేసినా తనకు కొన్ని పార్టీలు అవకాశం ఇవ్వలేదని, 2018లో పిలిచి టికెట్ ఇచ్చిన దైవసమానులైన సీఎం కేసీఆర్‌కు జీవితాంతం రుణపడి ఉంటానని చెప్పారు. నాడు ఇదే సభాస్థలిలో తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని సీఎం ఆదేశిస్తే గొప్ప మనస్సుతో ఆశీర్వదించి అసెంబ్లీకి పంపించిన కోదాడ నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని చెప్పారు. ఈ ఎన్నికల్లో తనను మరోసారి గెలిపించాలని కోరారు.

సీఎం చొరవతోనే సాగు, తాగునీటి సమస్య తీరింది: గొంగిడి సునీత

ఆలేరు నియోజకవర్గం అభివృద్ధి చెందిందని ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీత తెలిపారు. సభలో ఆమె మాట్లాడుతూ.. నా చర్మం ఒలిచి మీకు చెప్పులు కుట్టించేంత కృతజ్ఞతతో ఉన్నానని భావోద్వేగానికి గురయ్యారు. ఒకప్పుడు సాగు, తాగునీటి కోసం ఇబ్బంది పడ్డ ఆలేరు ప్రజలకు.. నేడు సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతోనే ఆ సమస్య తీరిందన్నారు. యాదగిరిగుట్టలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆలేరు రెవెన్యూ డివిజన్ చేయాలని, రఘునాథపురం, మాధాపూర్ నూతన మండలాలు చేయాలని, రాజాపేటలో ఐటీఐ, ఒకేషనల్ కళాశాల, తుర్కపల్లి, ఆత్మకూర్(ఎం)లో నూతన జూనియర్ కళాశాల, బొమ్మలరామారంలో జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కేసీఆర్‌ను కోరారు.

అపర భగీరథుడు కేసీఆర్: కిశోర్

2014కు ముందు తుంగతుర్తి నియోజకవర్గంలో కష్టాలు, కార్పణ్యాలు ఉండేవని, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత నియోజకవర్గానికి కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 1.50లక్షల ఎకరాలకు నీళ్లు పారుతున్నాయంటే అపర భగీరథుడు సీఎం కేసీఆరే కారణమని ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. 30, 40 సంవత్సరాలు నిండని చెరువు కూడా జలకల సంతరించుకుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు ద్వారా తుంగతుర్తి నియోజకవర్గానికి 100 పడకల ఆస్పత్రి వచ్చిందని తెలిపారు. నియోజకవర్గంలో 93వేల మందికి రైతుబంధు, 49వేల మందికి ఆసరా, 11వేల మందికి కల్యాణలక్ష్మి, 8వేల మందికి కేసీఆర్‌కిట్లు అందాయన్నారు. తనను మరోసారి గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే కేసీఆర్ హ్యాట్రిక్ ముఖ్యమంత్రి అవుతారన్నారు.

బీఆర్‌ఎస్‌కు అధికారం ఖాయం

- శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

కొండమల్లేపల్లి: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ మళ్లీ అధికారం చేపట్టడం ఖాయమని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం కొండమల్లేపల్లిలోని జెడ్పీటీసీ పస్నూరి సరస్వతమ్మ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో చాలామంది పార్టీలు మారుతుంటారని, అలాంటి వాళ్లను పట్టించుకోవద్దన్నారు. మీ అనుచరులు మిమ్మల్ని కాదని కాంగ్రెస్ పార్టీలో చేరారు, వారిని మీరు ఆపలేదా అని విలేకరులు ప్రశ్నించగా సాధ్యమైనంత వరకు ఆపడానికి ప్రయత్నం చేశానని, కానీ వారు వినలేదని తెలిపారు. ఒకరిద్దరు పార్టీని వీడి వేరే పార్టీలో చేరినంత మాత్రానా బీఆర్‌ఎస్ పార్టీకి వచ్చే నష్టం ఏమీ లేదన్నారు. బీజేపీ గాని, కాంగ్రెస్ గాని అధికారంలోకి వస్తే తెలంగాణ రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరిగా మారుతుందన్నారు. అలాంటి అవకాశం తెలంగాణ ప్రజలు వారికి ఇవ్వొద్దని అన్నారు. దేవరకొండ బీఆర్‌ఎస్ అభ్యర్థి రవీంద్రకుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ సమావేశంలో వివిధ మండలాల బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

తుర్కపల్లి : ఇంటి ముందు నిలిపిఉన్న ఓ ద్విచక్రవాహనం చోరీకి గురైంది. ఈ ఘటన మండల కేంద్రంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాఘవేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని యాదగిరిగుట్టకు వెళ్లే రోడ్డులో తన ఇంటి ఎదుట మహ్మద్ ఇమ్రాన్ యూనికాన్ బైక్‌ను నిలిపిఉంచాడు. శనివారం రాత్రి 1గంట సమయంలో గుర్తు తెలియని దుండగులు బైక్‌ను చోరీ చేశారు. దీంతో చుట్టుపక్కల వెతికినా కనిపించకపోవడంతో ఇమ్రాన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆదివారం ఎస్‌ఐ తెలిపారు.

త'స్మార్ట్' జాగ్రత్త

సోషల్ మీడియాలో ప్రచారానికి ఆంక్షలు

- అసత్య ప్రచారం చేస్తే కేసులే..
- పలు నిబంధనలు విధించిన ఎన్నికల సంఘం



చిట్యాల : ఎన్నికల సందడి మొదలైంది. ఆయా పార్టీల నేతలు ప్రత్యక్షంగా ఓటర్లను కలవడంతోపాటు సామాజిక మాధ్యమాల (వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రాం) ద్వారా సైతం ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. అయితే.. సోషల్ మీడియాలో శృతిమించిన, అసత్య ప్రచారాన్ని చేపడితే పోలీసు కేసులు నమోదు చేయడంతోపాటు జైలు శిక్షలు పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం సోషల్ మీడియాకు సైతం ఎలక్ట్రానిక్ మీడియాకు వర్తించే ఎన్నికల నిబంధనలను వర్తింపజేస్తోంది.

సోషల్ మీడియాలో పెయిడ్ న్యూస్..

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేసినట్లయితే ఆయా పార్టీలు, అభ్యర్థులు వెచ్చిస్తున్న ఖర్చు వివరాలను నమోదు చేసుకుని ఎన్నికల సంఘానికి అందజేయాల్సి ఉంటుంది. సోషల్ మీడియాలో ప్రచారం కూడా పెయిడ్ న్యూస్ కిందకే వస్తుంది. దీంతో ఈ ఖర్చు అభ్యర్థి ఎన్నికల ఖాతాలోకి వెళ్తుంది.

ఫార్వర్డ్ చేసినా నేరమే..

ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా తమకు వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా పోస్టింగ్ చేసిన సందేశాలను పార్వర్డ్ చేసిన వారిపై కూడా చర్యలు ఉంటాయి.

గ్రూప్ అడ్మిన్ బాధ్యతలివే..

సోషల్ మీడియాలో గ్రూప్ సభ్యులు అభ్యంతరమైన, వివాదాస్పద పోస్టులు, కామెంట్స్ పెట్టినా వెంటనే వాటిని అడ్మిన్ డిలిట్ చేయాలి. లేదంటే పోస్టింగ్ చేసిన సభ్యుడితోపాటు గ్రూపు అడ్మిన్ బాధ్యత వహించాల్సి ఉంటుంది. అదేవిధంగా ప్రస్తుత ఎన్నికల నిబంధనల ప్రకారం పోలింగ్‌కు 48 గంటల ముందే సోషల్ మీడియాలో సైతం ఎన్నికల ప్రచారాన్ని నిలిపి వేయాల్సి ఉంది.

అధికారుల నిరంతర నిఘా..

సోషల్ మీడియాపై అన్ని శాఖల అధికారులు నిఘా ఉంచుతారు. ఫొటో మార్ఫింగ్, అశ్లీల ఫొటోల షేరింగ్, ఇతరుల మనోభావాలు దెబ్బతినే విధంగా ఉన్న ఫొటోలు, సందేశాలు ఉంటే ఐటీ యాక్ట్- 2000 ప్రకారం సెక్షన్ 67 కింద జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. ఇదే నేరం పునరావృతమైతే పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.రెండు లక్షల జరిమానా విధిస్తారు.

మార్గదర్శకాలివే..

→ సోషల్ మీడియాలో వ్యక్తిగతం, పార్టీలపై, సంస్థలపై, అధికార యంత్రాంగంపై అసత్య ప్రచారం చేయొద్దు. పోటీ చేసే అభ్యర్థులపై కార్టూన్స్, మీమ్స్, షార్ట్ వీడియోల ద్వారా అసత్య ప్రచారం చేసినట్లు.. ఎవరైనా తగిన ఆధారాలతో ఫిర్యాదు చేస్తే వెంటనే పోలీసులు, ఎన్నికల అధికారులు కేసులు నమోదు చేసే అవకాశం ఉంది.

→ సోషల్ మీడియాలో చట్ట విరుద్ధమైన ప్రకటనలతో ప్రచారం చేయొద్దు.

→ రాజ్యాంగ ఉల్లంఘన, ఎన్నికల కోడ్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో ప్రచారం చేయొద్దు.

→ సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తే ఐపీసీ 504, 505 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసే అవకాశం ఉంది.

→ సోషల్ మీడియాలో ఎన్నికల ప్రచార ప్రకటనలకు ముందుగా జిల్లా, రాష్ట్ర స్థాయిల్లోని మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ అనుమతి పొందాల్సి ఉంటుంది.

బీఆర్‌ఎస్‌లో చేరిక

యాదగిరిగుట్ట: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కల్లూరి రామచంద్రారెడ్డి తన అనుచరులతో కలిసి ఆదివారం ఆలేరులో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ గులాబీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదే విధంగా కల్లూరి రామచంద్రారెడ్డితో పాటు తుర్కపల్లి మాజీ ఎంపీపీ బబ్బూరి రవీంద్రనాథ్‌గౌడ్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోల వెంకటేష్‌గౌడ్, బొమ్మలరామారం మాజీ సర్పంచ్ వెంకన్న సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మంత్రి జగదీష్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, బీఆర్‌ఎస్ అభ్యర్థి గొంగిడి సునీత, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, మాజీ స్పీకర్ మధుసూదనచారి, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఆల్దా చైర్మన్ మోతె పిచ్చిరెడ్డి, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, మదర్ డెయిరీ చైర్మన్ శ్రీకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జ్యోతి, మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్ పాల్గొన్నారు.



కల్లూరి రామచంద్రారెడ్డిని బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న సీఎం కేసీఆర్



కోల వెంకటేష్‌గౌడ్‌కు బీఆర్‌ఎస్ కండువా కప్పుతున్న సీఎం కేసీఆర్